ఆహ్లాదకరంగా నగరపాలక సంస్థ పార్కులు

- మల్టీపర్పస్ పార్కును త్వరలోనే అందుబాటులోకి తెస్తాం
- పనుల పరిశీలనలో మేయర్ యాదగిరి సునీల్ రావు

మల్టీపర్పస్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్ రావు

కార్పొరేషన్, ఆగస్టు 8 : నగర ప్రజలకు ఆహ్లాదం.. ఆనందాన్ని పంచేలా నగర పాలక సంస్థ పరిధిలో పార్కులను తీర్చిదిద్దుతున్నామని మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. గురువారం మల్టీపర్పస్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నగరపాలక సంస్థ నుంచి రూ.11 కోట్లతో పార్కులో ఏర్పాటు చేసిన ల్యాండ్ స్కేపింగ్, ఆహ్లాదం పంచే పచ్చని గడ్డి, పూల మొక్కలు, మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్, ఆంఫీ థియేటర్, పిల్లల ఆట పరికరాలు, ఈవీ డీఎం వాకింగ్ ట్రాక్‌తోపాటు గజీబో లాంటి సుందరీకరణ పనులను పరిశీలించారు. చివరి దశ పనులను వేగంగా పూర్తి చేసి.. పార్కు ప్రారంభానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర వ్యాప్తంగా ఉన్న 25 పార్కులను ఇప్పటికే అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాజీవ్ పార్కు పనులను కూడా పూర్తి చేసి, నెల చివరి కల్లా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. గతంలోనే ప్రజల ఆరోగ్యం కోసం 30 ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామని.. మరో 30 జిమ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తుల రాజేశ్వరీ బాలయ్య, కచ్చు రవీందర్, ఈఈ యాదగిరి, ఆర్వీ అధికారి మురళీ కృష్ణ, ఏజెన్సీ కాంట్రాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఆగస్టు 8 : ఈ నెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారత స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చేయాల్సిన ఏర్పాట్లపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. వేడుకలు జరుపనున్న పరేడ్ మైదానంలో వేదిక, సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఆయా శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడం మూలంగా, ప్రత్యేకాధికారులు ఉదయం వేళలోనే తమ మండలాలు, గ్రామాల్లో జాతీయ జెండా ఆవిష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా నిర్ణీత గడువులోపు ప్రతిపాదనలు పంపాలని, స్వచ్ఛదనం-పచ్చదనం, వనమహోత్సవం, సింగిల్ యూస్ ప్లాస్టిక్, మహిళాశక్తి, ప్రజాపాలనపై స్కిట్ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, అడిషనల్ డీసీపీ అశోక్ జయకుమార్, టౌన్ ఏసీపీ నరేందర్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, డీఆర్‌డీవో శ్రీధర్, సీపీవో కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

హుజూరాబాద్, ఆగస్టు 8: ప్రస్తుత వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పారిశుధ్య సిబ్బంది జెల్ల రాజేశ్, గిన్నారపు మొగిలిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఆర్డీవో రమేశ్ బాబు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహశీల్దార్ కనకయ్య, హెల్త్ ఆఫీసర్ జరీనా, మేనేజర్ భూపాల్ రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, కౌన్సిలర్ రమాదేవి తదితరులు ఉన్నారు.

ఎస్బీఐ చైర్మన్‌గా తెలంగాణ బిడ్డ ఎంపిక హర్షణీయం

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 8 : ఎస్బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) 27వ చైర్మన్‌గా జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాసులు శెట్టి నియామకం కావడంపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఒక మారుమూల గ్రామంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం విద్యనభ్యసించిన చల్ల శ్రీనివాసులు శెట్టి, ఇప్పుడు ఎస్బీఐ చైర్మన్‌గా నియామకమయ్యే స్థాయికి ఎదగడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. ఎస్బీఐ చైర్మన్‌గా ఇన్నేళ్ల కాలంలో తెలుగు వారు ఎవరూ ఎంపిక కాలేదని, ఇప్పుడు శ్రీనివాసులు నియామకం కావడం తెలంగాణ ప్రాంతానికి గొప్ప విశేషమని తెలిపారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సన్మానించాలని కోరారు.

'కాంగ్రెస్ పాలనలో దళితులపై దాడులు'

తెలంగాణచౌక్, ఆగస్టు 8: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని, వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, షాద్‌నగర్‌లో దళిత మహిళలను చిత్ర హింసలకు గురి చేసిన సీఐని సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత పట్ల వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు. బాధితురాలికి రూ.25లక్షలు పరిహారం చెల్లించాలన్నారు.

దత్తత ఉత్తర్వులు అందజేత

కలెక్టరేట్, ఆగస్టు 8 : శిశుగృహ నుంచి ఐదు నెలల పాపను దత్తత తీసుకున్న బెంగళూరుకు చెందిన దంపతులకు కలెక్టర్ పమేలా సత్పతి గురువారం దత్తత ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, పి.వో తిరుపతి పాల్గొన్నారు.

సెలవులో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, ఆగస్టు 8 : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మూడు రోజులపాటు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనులపై ఈ నెల 10 వరకు స్వగ్రామానికి వెళ్లగా, 11వ తేదీన తిరిగి విధుల్లో చేరనున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా అంజలి

జెర్రిపోతుల అంజలి

కొత్తపల్లి, ఆగస్టు 8 : కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా 4వ వార్డు కౌన్సిలర్ జెర్రిపోతుల అంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా గతంలో కొనసాగిన 2వ వార్డు కౌన్సిలర్ బండ రాధ మరణించడంతో ఇటీవల ఎన్నికల కమిషన్ నూతన వైస్ చైర్మన్ ఎంపిక కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం ఆర్డీవో ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించగా, ఏడుగురు కౌన్సిలర్లు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు 4వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న జెర్రిపోతుల అంజలిని వైస్ చైర్‌పర్సన్‌గా ప్రతిపాదించగా, 10వ వార్డు కౌన్సిలర్ గండు రాంబాబు బలపరిచారు. హాజరైన సభ్యులు పూర్తి మద్దతు ప్రకటించడంతో ఆమె విజయం సాధించారు. ఈ మేరకు అంజలికి ఆర్డీవో ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అంజలిని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తన ఎన్నికకు సహకరించిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లతో పాటు వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపికకు కృషి చేసిన కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలోద్దీన్‌కు అంజలి కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

కలెక్టరేట్, ఆగస్టు 8: కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఏ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం నగరంలోని భగత్‌నగర్‌లో గల ఆ సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో అధ్యక్షుడు తేరాల ప్రదీప్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, వారి ఆరోగ్య కార్డులు పనిచేయక వయోవృద్ధులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటగిరీ 4, ఇతర విభాగాల ఉద్యోగులకు 010 పద్దు కింద ప్రతి నెలా మొదటి తారీఖున వేతనాలు విడుదల చేస్తామని ఇచ్చిన హామీ కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. పభుత్వం స్పందించకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం బాధ్యులు రాచకట్ల వెంకటస్వామి, వెల్దండి పవన్‌కుమార్, చింతకింది వరుణ్, వెగ్గలం మనోహర్, అరుంధతి, మానస, శ్రీలక్ష్మి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

'జనజాగరణ' విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 8 : నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుంద లాల్ మిశ్రా భవనంలో గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14న చేపట్టనున్న జనజాగరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

తెలంగాణచౌక్, ఆగస్టు 8: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితులను విస్మరించిందంటూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్ ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ చౌక్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని ప్లకార్డులు ప్రదర్శించారు. దళిత వర్గాలకు జనాభా దామాషా పద్ధతిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక, దళిత, గిరిజనులను అణచివేయడానికి కేంద్రం కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, రాజు, సంపత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రికవరీకి ప్రత్యేక టీం

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 8: హుజూరాబాద్ ప్రాంతంలో ఎక్కువగా సెల్ ఫోన్‌లు పోతున్నాయని, వాటిని రికవరీ చేయడానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్ల టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. ఇటీవల పోయిన ఎనిమిది స్మార్ట్ మొబైల్స్‌ను గుర్తించి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాటి యజమానులకు అప్పగించారు.

వేధింపులకు తాళ లేక యువతి ఆత్మహత్య

అఖిల (ఫైల్)

తిమ్మాపూర్, ఆగస్టు 8: 'మానసికంగా, ఆర్థికంగా టార్చర్ చేసినారు.. నా సావుకు కారణమయ్యారు..' అంటూ సూసైడ్ నోట్ రాసి పెట్టి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన మామిడి అఖిల(20) ఎంఎల్టీ కోర్సు పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నది. గ్రామంలో తల్లిదండ్రులు హోటల్ నిర్వహిస్తుండగా గురువారం మధ్యాహ్నం వరకు హోటల్ వద్ద తల్లితో గడిపిన అఖిల.. ఇంటికి వెళ్లింది. మూడున్నర గంటల సమయంలో తల్లి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో దూలానికి అఖిల వేలాడుతూ కనిపించింది. భయాందోళనకు గురైన ఆమె, చుట్టుపక్కల వారిని పిలవగా వారు వచ్చి చూడడంతో అప్పటికే మృతి చెంది ఉన్నది. చుట్టుపక్కల వెతకగా ఒక బుక్కులో సూసైడ్ నోట్ రాసిపెట్టింది. ఆంగోతు భరత్, కోటయ్య, విజయ అనే వ్యక్తులు తనను ఫోన్లో మానసికంగా వేధించారని, ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి చేశారని.. ఏడిపించి తన చావుకి కారణమయ్యారని అందులో రాసి ఉంది. కాగా, భరత్ ప్రేమ పేరుతో వేధించినట్టు సమాచారం. తన కూతురు చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చేరాలు తెలిపారు.

హర్ ఘర్ తిరంగా అభియాన్ విజయవంతం చేయాలి

విద్యానగర్, ఆగస్టు 8: భారత ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు తలపెట్టిన హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం సన్నాహక సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఈనెల 11 నుంచి 15 వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై పార్టీ శ్రేణుకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

సొసైటీలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి

చిగురుమామిడి, ఆగస్టు 8: సొసైటీలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్ అన్నారు. గాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తి దారుల సంఘ సభ్యుల సమావేశం సొసైటీ అధ్యక్షుడు మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా నాబార్డ్ ఆయన జయప్రకాశ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర రావు పంటల సాగుకు సంబంధించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శంకరపట్నం, ఆగస్టు 8: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల సాధనకు గ్రామ పంచాయతీ కార్మికులు ఒకరోజు ధర్నా కార్యక్రమం చేపట్టారు. కాగా, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి, అదే దారిలో ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, మండలాధ్యక్షుడు ఎల్కపెల్లి సారయ్య ఎమ్మెల్యేకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌తో పాటు డీపీవోతో ఫోన్‌లో మాట్లాడారు. జీతాలు విడుదలయ్యాయని, ట్రెజరీలో జమ అయ్యాయని, శుక్రవారం సాయంత్రంలోగా అందరికీ జీతాలు అకౌంట్లలో పడతాయని వెల్లడించారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేసే పనిలో ప్రభుత్వం ఉందని, ఓపిక పట్టాలని ఎమ్మెల్యే పంచాయతీ కార్మికులను కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కేశవపట్నం రైతు వేదికలో 174 మంది లబ్ధిదారులకు రూ.40 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల భాస్కర్, ఏవో ఆర్ శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, ఏఈవోలు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహించాలి

మానకొండూర్, ఆగస్టు 8: మండల కేంద్రంలోని కరీంనగర్- వరంగల్ రహదారికి ఇరువైపులా డ్రైనేజీల్లో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచి పోయి ఉండడం, రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోవడంతో అధికారులపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పారిశుధ్య పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేసుకోవాలి

వీణవంక, ఆగస్టు 8: మండల పరిధిలోని అక్షర జ్ఞానులందరూ గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు చేసుకోవాలని లైబ్రేరియన్ కనకలక్ష్మి కోరారు. గ్రంథాలయ పరిచయ కార్యక్రమంలో భాగంగా గురువారం సభ్యత్వ నమోదుపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది ర్యాలీ తీసి, మొక్కలు నాటారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతర్లపల్లిలో వైద్య శిబిరం

ఇల్లందకుంట, ఆగస్టు 8: పాతర్లపల్లి గ్రామంలో ఇల్లందకుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఇక్కడ వైద్యులు తులసీదాస్, కల్యాణ్, సూపర్‌వైజర్ శ్యామల, సిబ్బంది ఉన్నారు.

ఇసుక వేలం

గంగాధర, ఆగస్టు 8: మండలంలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 10 ట్రాక్టర్ల ఇసుకను ఈ నెల 9న ఉదయం 11 గంటలకు తహసీల్ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ అనుపమ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

తిమ్మాపూర్, ఆగస్టు 8: తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బత్తుల రాకేశ్, అపర్ణ దంపతులు తమ కుమారుడు హిమాన్ష్ నందన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు వీర మాధవ్, ప్రశాంత్, గౌతమ్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె

జమ్మికుంట/ వీణవంక, ఆగస్టు 8: తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జమ్మికుంట, వీణవంక మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల ఎదుట జీపీ కార్మికులు ఒక్క రోజు శాంతియుత సమ్మెకు దిగారు. గేటు ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు.

ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలిగా స్వప్న

విద్యానగర్, ఆగస్టు 8: జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలిగా జిల్లా కేంద్రానికి చెందిన చకిలం స్వప్నాశ్రీనివాస్‌ను గురువారం నియమించారు. జిల్లా ఆర్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ నియామక పత్రాలు అందించారు కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమరవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివనాథుని శ్రీనివాస్, జిల్లా కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు ఎలగందుల మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీ

విద్యానగర్, ఆగస్టు 8: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ హైదరాబాద్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర 108, 102 సర్వీసుల హెచ్.ఆర్ ప్రధాన అధికారి బి. కిరణ్ కిశోర్ కరీంనగర్‌లోని 108 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వాహనంలోని పరికరాలు, అత్యవసర మందులు, సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఎలాంటి అత్యవసర ప్రమాద ఘటన జరిగినా పది నిమిషాల్లోపు అక్కడికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా 108 మేనేజర్ సలీం, జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ ఇమ్రాన్, 108, 102,1962, పారిద్వ వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మకల్‌లో ఫీవర్ సర్వే

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8: బొమ్మకల్‌లో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రాజు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏవో సత్యం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చిగురుమామిడి, ఆగస్టు 8: ఇందుర్తి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణ లక్ష్మి చెక్కులను తహసీల్దార్ రమేశ్ శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు చింతపూల నరేందర్, నాయకులున్నారు.

డీఎస్పీ జిల్లా కన్వీనర్‌గా తాళ్ల నరేశ్

చిగురుమామిడి, ఆగస్టు 8: ధర్మ సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన తాళ్ల నరేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ ఇన్‌చార్జి చిలువేరు శ్రీకాంత్ ప్రకటనలో తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నమెంట్‌కు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, ఆగస్టు 8 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న టోర్నమెంట్‌కు అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ఏ అశ్వత్‌రావు ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అతడిని విద్యాసంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి అభినందించారు.

న్యాయవాదుల నిరసన

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 8: జనగామ పట్టణంలో న్యాయవాద దపంపతులపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం హుజూరాబాద్ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ దాడి ఘటనకు నిరసనగా శుక్రవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియన్ ప్రధాన కార్యదర్శి మట్టెల తిరుపతి, సీనియర్ న్యాయవాదులు వీరసేనారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ముక్కెర రాజు, నల్ల భూమిరెడ్డి, బండి కళాధర్, పులుగు లింగారెడ్డి, బండి రమేశ్, నక్క సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ముషం మౌనిక, విక్రం, రవితేజ, ప్రవీణ్, కుమారస్వామి, మాధవి, సరిత, దివ్య, లింగమూర్తి, దేవయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అధికారులకు టీఎన్జీవో నాయకుల శుభాకాంక్షలు

కొత్తపల్లి, ఆగస్టు 8 : సా